నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్, మే 25 : వర్షాకాలంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకుగాను విద్యుత్ మరమ్మతు పనుల నిమిత్తం ఆదివారం ఆస్మాన్‌ఘడ్ సబ్ డివిజన్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆస్మాన్ ఘడ్ డివిజన్ డీఈ హనుమంత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ సలీంనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు, 11కేవీ సూపర్ బజార్ ఫీడర్ పరిధిలో ఉదయం 11.30 నుంచి ఒంటి గంట వరకు, 11కేవీ గంజ్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఆయా ఫీడర్ల పరిధిలోని ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

పీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా ప్రసాద్

ఆర్కేపురం, మే 25 : టీ పీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా సుపులేటి పీవీఆర్.ప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయవాదులకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటామన్నారు. ప్రజల్లో న్యాయ వ్యవస్థపై అవగాహన పెంచేందుకు కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న న్యాయవాదులకు హెల్త్ కార్డ్స్ రూ.5లక్షల పరిమితతో న్యాయవాదుల తల్లిదండ్రులకు కూడా హెల్త్ కార్డు వర్తించే విధంగా కృషి చేస్తానని పేర్కొన్నారు. న్యాయవాదుల రక్షణ కోసం అడ్వొకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే వెంటనే చట్టసభల్లో బిల్లును ప్రవేశపెట్టేవిధంగా కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలను అప్పగించిన సీఎం రేవంత్‌రెడ్డికి, లీగల్ సెల్ చైర్మన్ అశోక్‌గౌడ్, రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

ఎల్బీనగర్, మే 25: కొత్తపేట డివిజన్‌లోని ప్రధాన సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్‌కు వినతి పత్రం సమర్పించారు. కొత్తపేట డివిజన్‌లోని ఎస్ఆర్ఎల్ కాలనీ ప్రధాన రోడ్డులో వరదనీటి కాలువ పనులు అర్ధాంతరంగా, అసంపూర్తిగా వదిలివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, బాక్స్ డ్రెయిన్ పనులను పూర్తి చేసి నూతన రోడ్డు వేయాలని, అదే విధంగా సత్యనగర్, రాఘవేంద్ర కాలనీ, భరత్‌నగర్ ఫేజ్-1,2, రాజీవ్‌గాంధీనగర్ ఫేజ్-1,2 ప్రాంతాల్లో డ్రైనేజీ పనులను పూర్తి చేసిన అధికారులు ఆ ప్రాంతాల్లో రోడ్డు నిర్మాణాలు చేయకపోవడంతో ప్రజలు ఇక్కట్లకు గురి అవుతున్నారని పేర్కొన్నారు. రాబోయే వర్షాకాలం నేపథ్యంలో బాక్స్ డ్రెయిన్ పనులు, రోడ్ల మరమ్మతులు చేయాలని కోరారు.

మట్టి దిబ్బలను మరిచారు..

చంపాపేట రోహిణి హాస్పిటల్ ముందు రోడ్డును తవ్వి.. మట్టి దిబ్బలు అక్కడే వదిలేసిన దృశ్యం

చంపాపేట, మే 25: చంపాపేట డివిజన్ పరిధి ఎస్‌జీఆర్ కాలనిలోని రోహిణి హాస్పిటల్ ముందు పైపులైన్ మరమ్మతులు చేపట్టేందుకు కొన్ని రోజుల క్రితం వీధి రోడ్డును తవ్వారు. తవ్విన చోట రోడ్డుకు మరమ్మతులు చేపట్టకపోగా.. తవ్విన మట్టిని అక్కడి నుంచి తరలించడం మరిచారు. దీంతో కాలనీకి రాకపోకల సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతే కాకుండా పక్కనే పెట్రోల్ బంక్ ఉండటంతో నిత్యం ఈ రోడ్డు మార్గం వాహనాలతో రద్దీగా ఉంటుంది. దీంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని పాదచారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

కందుకూరు రైతు వేదికలో రైతులకు సలహాలు ఇస్తున్న అధికారులు

రైతు వేదికలే దిక్సూచి

- పంటల సాగుపై గ్రామస్థాయిలో చర్చలు
- అందుబాటులో ఏఈవోలు
- సాగుపై రైతులతో సమాలోచనలు
- ఇతర పైంటలపై అవగాహన
- నెరవేరిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆశయం

క్షేత్ర స్థాయిలో పంట పరిశీలన..

రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం. ఒక్కో రైతు వేదికలో ఒక వ్యవసాయ విస్తరణ అధికారి ఉంటున్నారు. రైతులకు సలహాలు, సూచనలు అందిస్తున్నాం. వారానికి ఒకసారి రైతు వేదికలో సమావేశాలు నిర్వహిస్తున్నాం. పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్నాం. అలాగే క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి ఏ సీజన్‌లో ఏ పంటలు వేసుకోవాలో సూచిస్తున్నాం.

– లావణ్య, మండల వ్యవసాయ అధికారి కందుకూరు

కందుకూరు, మే 25: ఒకప్పుడు వ్యవసాయ అధికారి ఎక్కడుంటాడో తెలిసేది కాదు. ఏదైనా సమస్య వస్తే ఎవరిని కలువాలో.. ఎక్కడ కలువాలో తెలిసేది కాదు. ఇదంతా ఉమ్మడి రాష్ట్రంలో పరిస్థితి. కానీ తెలంగాణ ఏర్పడిన అనంతరం ఇప్పుడు వ్యవసాయ అధికారి ఎక్కడున్నడని అడిగేతే.. రైతు వేదికలో అనే సమాధానం వినిపిస్తున్నది. రైతులను సంఘటితం చేయాలనే మాజీ సీఎం కేసీఆర్ సంకల్పం కార్యరూపం దాల్చుతున్నది. ఈ విధంగా రైతులను సంఘటితం చేసేందుకు రైతు వేదికలను నిర్మించడం దేశంలోనే తొలిసారి కావడం గమనార్హం. గతంలో సాగుపై రైతులకు సూచనలు ఇచ్చేవారే కరువు. కానీ ఇప్పుడు ప్రతి గ్రామానికో ఏఈవోను గత బీఆర్ఎస్ ప్రభుత్వం నియమించింది. దీంతో సాగులో ఎలాంటి సందేహం వచ్చినా ఏఈవోను సంప్రదించి పరిష్కరిచుకొనే అవకాశం లభించింది. రైతు వేదికలను వేదికగా చేసుకొని రైతులు, అధికారులు పంటల సాగుపై సమాలోచనలు చేస్తున్నారు. ఎలాంటి పంటలు వేయాలి? ఎలాంటి యాజమాన్య పద్ధతులు పాటించాలి? ఏ పంటలకు డిమాండ్ ఉన్నది? ఏ విత్తనాలు బాగుంటాయి? వంటి అంశాలపై ఏఈవోలతో చర్చించి రైతులు నిర్ణయం తీసుకొంటున్నారు. తెలంగాణ తొలిముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న నిర్ణయంతో రైతులు సంతోషపడుతున్నారు.

విద్యార్థులకు సకాలంలో దుస్తుల పంపిణీ

మహిళా సంఘాలకు మహిళా మ్యాక్స్‌లో అవగాహన కల్పిస్తున్న జిల్లా డీఆర్‌డీఏ పీడీ శ్రీలత, మండల ఏపీఎం కవిత

కందుకూరు, మే 25 : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఉచిత యూనిఫాంలను మహిళా సమైక్య ఆధ్వర్యంలో తయారు చేస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీలత తెలిపారు. జిల్లా వ్యాప్తంగా యూనిఫాంల తయారు ముమ్మరంగా కొనసాగుతున్నట్లు చెప్పారు. పాఠశాలల ప్రారంభానికి ముందే విద్యార్థులకు దుస్తులు తయారు చేసి అప్పగించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. మండల ఏపీఎం కవితతో కలిసి మహిళా మ్యాక్స్‌లో మహిళా కుట్టు మిషన్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. మహిళలకు ప్రభుత్వం కల్పించిన అవకావాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మహిళా సంఘాలకు డ్రస్సుల తయారీని అప్పగించినట్లు పేర్కొన్నారు. మండలంలో తిమ్మాపూరు, లేమూరు, కందుకూరు, పులిమామిడి నాలుగు క్లస్టర్లుగా ఏర్పాటు చేసి క్లస్టర్‌కు 15నుంచి 20మంది మహిళా శక్తి కుట్టుమిషన్ కేంద్రానికి మహిళలకు డ్రస్సులను తయారు చేయాల్సి ఉంటుందని ఏపీఎం కవిత పేర్కొన్నారు. మండలంలోని 53 స్కూళ్లకు 11,378 యూనిఫాంలను తయారు చేయాల్సి ఉంటుందని వివరించారు. దీనికి సంబంధించిన బట్ట టెస్కో నుంచి ప్రభుత్వం సరఫరా చేసినట్లు వివరించారు. ఒక్కో విద్యార్థికి రెండు జతల బట్టలు తయారు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డ్వాక్రా సంఘాల లీడర్లు మహిళలు, పాల్గొన్నారు.

జాతీయ ట్రోబాల్ టోర్నీలో తెలంగాణ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: పాటియాలా(పంజాబ్) వేదికగా ఈ నెల 28 నుంచి మొదలయ్యే 29వ జాతీయ సబ్ జూనియర్ ట్రోబాల్ చాంపియన్‌షిప్‌నకు తెలంగాణ బాలుర, బాలికల జట్లను శనివారం ఎంపిక చేశారు. బాలుర టీమ్ కెప్టెన్‌గా సిద్దార్థ్, బాలికల జట్టుకు రక్షిత నాయకత్వం వహించనుంది. జట్ల ఎంపికతో పాటు ప్లేయర్లకు ప్లేయింగ్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు నవీన్ యాదవ్, ఉపాధ్యక్షుడు జగన్ మోహన్ గౌడ్, కిరణ్‌చారి పాల్గొన్నారు.

నూతన నియామకం

ఉప్పల్, మే 25 : సీపీఎం ఉప్పల్ సర్కిల్ కార్యదర్శిగా జె.వెంకన్న ఎన్నికైనారు. ఉప్పల్‌లోని సీపీఎం కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో వెంకన్నను కార్యదర్శిగా ప్రకటించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు నర్సింగ్‌రావు, మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యం, కార్యదర్శివర్గ సభ్యులు చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పార్కు స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు

మన్సూరాబాద్, మే 25: కాలనీలో ఉన్న పార్కు స్థలాలు అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు చుట్టూరా ప్రహరీ గోడలను నిర్మిస్తున్నామని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. హయత్‌నగర్ పరిధి లక్ష్మీభవానీ లోని పార్కు స్థలంలో నిర్మిస్తున్న ప్రహరీ గోడ పనులను శనివారం పరిశీలించారు. అనంతరం బృందావన్‌కాలనీలో పర్యటించి అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. సీఎస్ఆర్ కాలనీ నుంచి మొదలైన ట్రంక్ లైన్ పనులు కొన్ని కారణాల వలన అర్ధాంతరంగా ఆగిపోయాయని.. హెచ్ఎండబ్ల్యూఎస్, ఎస్‌బీ అధికారులతో మాట్లాడి సదరు పనులను తిరిగి ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జల మండలి ఏఈ రాజు, ఏటీఓ విశ్వనాథ్, నర్సింగ్‌రావు, కాలనీవాసులు నవీన్ రావు, నరేంద్రకుమార్, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీభవానీకాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

సైదాబాద్ మండల తాసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

రౌద్ర సొసైటీ నిర్మాణాలు నిలిపేయాలి

సైదాబాద్, మే 25 : ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని సింగరేణికాలనీలో రౌద్ర హౌసింగ్ సొసైటీ నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను నిలిపేయాలని కోరుతూ శనివారం సీపీఐ నాయకులు సైదాబాద్ మండల తాసీల్దార్ జయశ్రీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ సీనియర్ నాయకులు ఆర్.శంకర్ నాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు పొందకుండా అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాలను నిలిపేయాలని.. ఆక్రమణదారులపై తగు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ డివిజన్ కార్యదర్శి షేక్ మహమూద్, సీపీఐ నాయకులు దశరథ్ నాయక్, పంతునాయక్, వంశీ, సుకూర్‌పాష, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు.. రోడ్డుపాలు

సైదాబాద్, మే 25: అసలే ఎండా కాలం.. ఆపై రోజు విడిచి రోజు వస్తున్న తాగునీటిని కాపాడుకోవాల్సిన ప్రజలు నిర్లక్షంగా నీటిని వీధుల్లోకి వదలడం ఒకవైపు.. మరోవైపు అధికారుల పర్యవేక్షణ లోపంలో తాగునీరు రోడ్లపై వరదలా ప్రవహిస్తోంది. ఇది ఎక్కడో కాదు సైదాబాద్ హౌసింగ్ బోర్డు కాలనీలో వరదలై పారుతున్న తాగునీటి సమస్య. అయితే ఇప్పటికే జలమండలి అధికారులు పలు కాలనీల్లో నీటి వృథాపై హెచ్చరికలు జారీ చేశారు. అంతే కాకుండా జరిమానా సైతం విధించారు. అయినా.. కొందరి నిర్లక్ష్యం వల్ల యథా విధిగా విలువైన తాగునీరు రోడ్డు పాలవ్వడం పరిపాటిగా మారింది. ఇప్పటికైనా జలమండలి ఉన్నతాధికారులు దృష్టిసారించి రోడ్లపై వృథాగా ప్రవహిస్తున్న తాగునీటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సైదాబాద్ హౌసింగ్ బోర్డు కాలనీలో రోడ్లపై వృథాగా ప్రవహిస్తున్న తాగునీరు

అట్టహాసంగా ముగిసిన బ్రహ్మోత్సవాలు

కందుకూరు, మే 25 : ముచ్చర్ల గ్రామ పంచాయతీ పరిధి ఊటకలపల్లిలోని దేవుని గుట్టపై లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు అట్టహాసంగా ముగిశాయి. ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు నిర్వాహకులు మాజీ సర్పంచ్ లక్ష్మణ్ ముదిరాజ్ సమక్షంలో చండీ ఉపాసకులు రేవల్లె రాజువర్మ ఆధ్వర్యంలో పూజలు హోమాలు, చక్రతీర్థం, బోనాలను నిర్వహించారు. 23న కల్యాణం జరిపించారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బందికి ఉచితంగా దుస్తులను పంపిణీ చేశారు. మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో పాటు రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, ఎల్మటి దేవేందర్‌రెడ్డి సాధ మల్లారెడ్డి, నిమ్మ అంజిరెడ్డి, మహేందర్, భక్తులు పాల్గొని దర్శించుకున్నారు.

హనుమాన్ దేవాలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

ప్రతి ఒక్కరూ దైవ చింతనను అలవర్చుకోవాలి

ఆర్కేపురం, మే 25 : ప్రతి ఒక్కరూ దైవ చింతనను అలవర్చుకోవాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి తెలిపారు. మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లేనిన్‌నగర్ హనుమాన్ దేవాలయం 7వ వార్షికోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యేను శాలువాతో తస్కరించారు. ఆలయ చైర్మన్ రాజుగౌడ్, ఫ్లోర్‌లీడర్ భూపాల్‌రెడ్డి, మేయర్ దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ప్రధాన కార్యదర్శి జటావత్ శ్రీనునాయక్, దిండు భూపేశ్ గౌడ్, రాజ్‌కుమార్, మోహన్‌నాయక్ ఉన్నారు.

వైభవంగా త్రినేత్రాంజనేయ దేవస్థానం జాతర

త్రినేత్రాంజనేయ స్వామి దేవస్థానంలో పూజల్లో పాల్గొన్న సతీశ్‌కుమార్ గౌడ్ తదితరులు

వనస్థలిపురం, మే 25: సాహెబ్‌నగర్‌లోని ప్రసిద్ధ త్రినేత్రాంజనేయ దేవస్థానం జాతర వైభవంగా సాగుతోంది. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారికి పూజలు నిర్వహించారు. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దగౌని సతీశ్‌కుమార్ గౌడ్ కుటుంబంతో హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 4వందల ఏండ్లకు పైగా చరిత్ర కలిగిన ఆలయం అన్నారు. జంటనగరాల ప్రజలు స్వామివారిని దర్శించుకోవాలన్నారు. జాతరకు సరైన ఏర్పాట్లు చేసిన దేవస్థానం కమిటీని, దేవాదాయ శాఖను అభినందించారు.

బాలాపూర్ మండల గౌడ సహకార సంఘం నూతన కమిటీ

నూతనంగా ఎన్నికైన బాలాపూర్ మండల గౌడ సహకార సంఘం ప్రతినిధులు

ఆర్కేపురం, మే 25 : బాలాపూర్ మండల గౌడ సహకార సంఘం ఎన్నికలు శనివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా గిరుకటి కృష్ణంరాజ్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా ముప్పిడి ధన్‌రాజ్‌గౌడ్, డైరెక్టర్లుగా తూళ్ళ మల్లేశ్ గౌడ్, రంగ నాగేశ్ గౌడ్, జూకంటి సురేశ్ గౌడ్‌ను ఎన్నుకున్నారు.

ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. బాలాపూర్ మండలంలో గౌడ సహకార సంఘం బలోపేతానికి అన్ని విధాలుగా కృషి చేస్తామని తెలిపారు. గౌడ సంఘం కులస్తుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. తమ ఎన్నికకు సహకరించిన గౌడ కులస్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

టయోటా కొత్త మోడల్ కారు ఆవిష్కరణ

సిటీబ్యూరో, మే 25(నమస్తే తెలంగాణ): అర్బన్ క్రూజర్ సెగ్మెంట్‌లో నూతన మోడల్‌ను టయోటా ఆవిష్కరించింది. టైజర్ పేరుతో వస్తున్న కారును హర్ష టయోటాలో అందుబాటులోకి తీసుకువచ్చారు. 1000 సీసీ అండ్ 1200 సీసీతో వచ్చిన టైజర్‌ను ఎల్బీనగర్‌లోని హర్షా టయోటా షోరూమ్‌లో స్థానిక ప్రజాప్రతినిధులు, వీపీ సేల్స్ మీర్జా అహ్మద్ ఆలీ ఖాన్ విడుదల చేశారు.